క్లుప్తంగా

సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



గూడూరు: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కార్యదర్శి కారుమంచి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఆకుమర్రులో ఎస్సీ సోదరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించాలని కోరారు. డప్పు వాయిద్యాలతో ర్యాలీలు నిర్వహించడమే కాకుండా అన్నదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తద్వారా యువతలో అంబేడ్కర్ చూపిన మార్గం పట్ల చైతన్యం తీసుకురావాలని ఆయన కోరారు. సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

95 మందికి నేత్రవైద్య పరీక్షలు

ఉచిత శస్త్రచికిత్సలకు 83 మంది ఎంపిక



నాగాయలంక: సుదర్శి మానవతా సేవాసంస్థ అందిస్తున్న నేత్ర సేవలు ఆదర్శనీయమని పలువురు అభినందించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి(పెదకాని) సహకారంతో ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో ఈ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో జరిపిన శిబిరంలో 95 మందికి డాక్టర్ సుభాష్ పరీక్షలు చేయగా వీరిలో 83 వృద్ధులను ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేసి ఉచిత శస్త్రచికిత్సలకై బస్సులో శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి ప్రసన్నకుమార్, టి.రవిబాబు మత్తి శివ తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

మచిలీపట్నంటౌన్: స్థానిక ఆజాద్ రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద వేసవి సందర్భంగా లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం బాటసారులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఆలయం వద్ద ఉన్న ఈ చలివేంద్రంలో పెద్ద ఎత్తున తరలివచ్చిన బాటసారులు చల్లని మజ్జిగను స్వీకరించి వేసవి తాపం నుంచి రక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ మామిడి మురళీకృష్ణ, న్యాయవాది లంకిశెట్టి సాయి ఫణి సంతోష్, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా మురళి, ఈ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



మచిలీపట్నంటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించేందుకు పలు సంఘాలు, పార్టీల నాయకులు ఏర్పాట్లు సంసిద్ధం చేస్తున్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాలతో పాటు కాలనీల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ కాంస్య విగ్రహం వద్ద జిల్లా కలెక్టర్, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. దీంతో ఈ విగ్రహాన్ని, సర్కిల్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక రామానాయుడుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్ర పటానికి ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కిట్టు, పార్టీ నాయకులు పూల మాల వేసేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. నియోజకవర్గంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించేందుకు పలు దళిత సంఘాలు సన్నాహాలు పూర్తి చేశారు. విగ్రహ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు, స్వీట్ల పంపిణీ, ర్యాలీలు నిర్వహించనున్నారు. కృష్ణాజిల్లా దళిత జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ సమీపంలోని ఎస్ కన్వెన్షన్ హాల్లో హెల్ప్ ఆస్పత్రి సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభించనున్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

రోడ్లపై పశువులు.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు

- తరచూ ప్రమాదాలు
- పంటల సమయంలో చేలల్లో మేస్తున్నాయని ఫిర్యాదులు
- అప్పుడప్పుడూ బందులదొడ్డిలో పెట్టి ఫైన్లు
- అధికారుల నిర్లక్ష్యంతో యథావిధిగా సమస్య



ప్రధాన రహదారి మధ్యలో డివైడర్‌ను ఆనుకుని పడుకున్న పశువులు



మందుల దుకాణం ఎదురుగా తిష్టవేసిన ఆవులు

పెడన: పట్టణంలో రోడ్లపై పశువులు సంచరిస్తూ పాదచారులను, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాహనదారులు అనుకోని ప్రమాదం జరిగితే అప్పుడు మాత్రమే స్పందించే పోలీసులు, మున్సిపల్ అధికారులు ఆ కొన్ని రోజులు మాత్రమే ఆయా పశువులను బంధించి బందులదొడ్డిలో పెట్టి అపరాధరుసుం వసూలు చేయడం పరిపాటిగా మారింది. పశువుల యజమానులకు నోటీసులు జారీ చేయడం, వాటిని కొన్నాళ్ల పాటు వదిలిపెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం, ఆ తరువాత అధికారులు పట్టించుకోకపోవడంతో పశువుల యజమానులు వాటిని యథేచ్ఛగా వదిలేస్తున్నారు. అవి కాస్తా పగలూ రాత్రీ తేడా లేకుండా ప్రధాన రహదారులు, పుర వీధులలో సంచరిస్తూ పాదచారులను, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. పలు దుకాణాల ముందు తిష్టవేసి పడుకుంటున్నాయి. ఆయా దుకాణాల వారు వాటిని చూసి వాహనాలు ఆపకుండా, ఏమీ కొనుగోలు చేయకుండా వెళ్లిపోతున్నారని ఆయా దుకాణ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో రోడ్లపై పడుకుని తోలినా కదలకుండా గంటల తరబడి ఇబ్బందులు పెడుతున్నాయి.

శాశ్వత పరిష్కారంపై దృష్టి ఏదీ?

పశువులు రోడ్లపై తిరగకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ సమస్యలతో పాటు పశువుల యజమానులు సైతం అందరి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నడుచుకోవాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

విష్ణుమూర్తి కుటుంబానికి పరామర్శ



విష్ణుమూర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉప్పాల రాము

కృత్తివెన్ను: పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించి, పార్టీకోసం ఎంతో కష్టపడిన మంచి కార్యకర్తను కోల్పోవడం ఎంతో విచారకరమని పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము అన్నారు.

మండలంలోని పల్లెపాలెంకు చెందిన ఈదరపల్లి విష్ణుమూర్తి (అప్పారావు) నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. భీమవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. ఆయన భౌతిక కాయాన్ని రాము సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. విష్ణుమూర్తి 1995లో పంచాయతీ ఉపసర్పంచ్‌గా పనిచేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషిచేశారని రాము అన్నారు. అటువంటి కార్యకర్త లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, పార్టీ మండల కన్వీనర్ భూపతిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ గంగాధర్, పార్టీ రైతు సంఘం నాయకులు విశ్వేశ్వరరావు, స్థానిక సర్పంచ్ కొల్లాటి రాజులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న కాగిత కృష్ణ ప్రసాద్

గూడూరు: పెడన నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు అయ్యాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆదివారం గూడూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రూ.22 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో అంతర్గత రహదారులు, శ్మశాన వాటికల్లో షెడ్లు, ప్రహరీల నిర్మాణాలు చేపట్టామన్నారు. తాజాగా రూ.13 కోట్లతో ఆర్ అండ్‌బీ రోడ్లు మంజూరయ్యాయన్నారు. పోడు- చిన్నగొల్లపాలెం, మునిపెడ- కోమాళ్లపూడి, బంటుమిల్లి రోడ్లను నిధులు మంజూరు చేయించామన్నారు. 2019కి ముందు చేపట్టి అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాలల భవన నిర్మాణాలకు కూడా నిధులు మంజూరయ్యాయన్నారు. ఓఎన్‌జీసీ సంస్థ ద్వారా పాశ్చాపురం- చినపాండ్రాక రోడు నిర్మాణానికి రూ.5.6 కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించామన్నారు. చిన పాండ్రాకలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.45 లక్షల వ్యయంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు కంపెనీ సౌజన్యంతో కంప్యూటర్లు సమకూర్చుతున్నట్లు వివరించారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. గూడూరు డీసీ చైర్మన్ పోతన వెంకట లక్ష్మీనరసింహస్వామి, మాజీ సర్పంచులు కట్టా మునేశ్వరరావు, పోతన రామోజీ, గోపి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యుడి కుటుంబానికి రూ.15 లక్షలు అందజేత



అమృత హవేలీకి రూ.15 లక్షల విలువైన చెక్కు అందజేస్తున్న ఐడీఏ నాయకులు, సభ్యులు

చల్లపల్లి: దంత వైద్యుల కుటుంబాలకు అండగా ఉండే నిమిత్తం ఏర్పాటు చేసిన ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ఎంతో ఉపయోకరమని ఐడీఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అజయ్ బెనర్జీ అన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కృష్ణా జిల్లా బ్రాంచ్ దంత వైద్యుల కార్యవర్గ సమావేశం స్థానిక డాక్టర్ భగత్‌సింగ్ దంతవైద్యశాలలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అజయ్ బెనర్జీ, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ రావి శ్రీనివాసరావు పాల్గొని అసోసియేషన్ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల చీరాలకు చెందిన దంత వైద్యుడు సాల్మన్ రాజు మృతికి సంతాపంగా కొద్దిసేపు మౌనం పాటించారు. ఐడీఏ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా రూ.15 లక్షల విలువైన చెక్కును అజయ్‌బెనర్జీ, చల్లపల్లికి చెందిన దంతవైద్యులు రవి చౌదరి, వేణు తదతరుల చేతుల మీదుగా సాల్మన్‌రాజు సతీమణి మేరుగు అమృత హవీలాకు అందజేశారు. అనంతరం దంత వైద్య నైపుణ్యతను పెంపొందించుకునే కార్యక్రమంలో భాగంగా ఐడీఏ చైర్మన్ తనూజ, డాక్టర్ గార్లపాటి నితీష్‌ల ఆధ్వర్యంలో కృత్రిమ దంతాల అమరికలో ఉపయోగించే ఇంప్లాంట్స్ ప్లేస్‌మెంట్‌లో సి.బి.సి.టి. ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ ఉషాకాంతి, సెక్రటరీ డాక్టర్ థియోఫిలస్ గుంజా, వివిధ ప్రాంతాలకు చెందిన దంత వైద్యులు పాల్గొన్నారు.

నేడు అన్న సమారాధన

పెడన: పట్టణ బస్టాండు సమీపంలో గణపతి, శ్రీసాయి శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం ఉదయం 11 గంటలకు అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు గౌడ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పటమట బలరామ్, చిల్లిముంత చిరంజీవి ఆదివారం తెలిపారు. శ్రీరామనవమి వేడుకలు ముగింపు సందర్భంగా అన్న సమారాధన ఉంటుందన్నారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు జరుగుతుందని, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

బీపీ మండల్ స్ఫూర్తిగా పోరాడాలి



మండల్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

మచిలీపట్నంటౌన్: బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 43వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ఈడేపల్లిలోని కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఆ సంఘ నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీసీల ఆరాధ్య దైవం, బీహార్ ఏడవ ముఖ్యమంత్రి, సంఘసంస్కర్త, పార్లమెంట్ సభ్యుడిగా పని చేసిన బిందేశ్వర్ ప్రసాద్ మండల్ సేవలు మరువలేనివన్నారు. సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ బీ పీ మండల్ భారతదేశం మొత్తం పర్యటించి వెనుకబడిన తరగతుల వారి కష్టాలను గుర్తించారన్నారు. ప్రస్తుతం ఓబీసీ కోటాలో విద్య, ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్‌లను బీసీలు పొందడం మండల్ పుణ్యమే అన్నారు. బీసీలు కలిసికట్టుగా పోరాడి హక్కులను సాధించుకోవాలని సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. మండల్‌కు నివాళులర్పించిన వారిలో ఆ సంఘ నాయకులు జోగి శివ, బోగిరెడ్డి సుభాని, జన్ను గోవిందు, పెద్దిబోయిన సాంబ, చేబోయిన కోటేశ్వరరావు, ఎం. పవన్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

మహానగరంగా తీర్చిదిద్దేందుకు భాగస్వాములవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నాన్ని మహానగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో బందరు అభివృద్ధిపై పురప్రముఖులతో ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ముడా (ఎంయూడీఏ) ప్రాంతాన్ని సీఆర్డీయే రాజధాని పరిధిలోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించామని, త్వరలో సీఎంతో చర్చించి కార్యరూపంలోకి తీసుకువస్తామన్నారు. డిసెంబరు 2026 నాటికి బందరు పోర్టు మొదటి దశ నిర్మాణం పూర్తికానున్న దృష్ట్యా పోర్టు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు మంగినపూడి బీచ్ అభివృద్ధి కోసం సముద్రం వెంబడి రక్షణ గోడను నిర్మించనున్నట్లు తెలిపారు. క్రీడా కోర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రహదారులపై పశువుల సంచారంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిని నివారించేందుకు మంగినపూడి బీచ్ వద్ద పది ఎకరాలు కేటాయించి పట్టించుకోని పశువులను అక్కడికి తరలిస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్ డీకే బాలాజీ చెత్త లేని నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎంయూడీఏ చైర్మన్ మట్టా ప్రసాద్, మాజీ డెప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, బందరు ఆర్డీవో కె.స్వాతి, పలువురు కూటమి నాయకులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన జాతర మహోత్సవాలు



చల్లపల్లిలో పోతురాజు చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



అవనిగడ్డలో మొక్కుబడులు తీర్చుకునేందుకు వస్తున్న భక్తులు

చల్లపల్లి: మండలంలోని లక్ష్మీపురం చింతలమడ గ్రామ దేవత శ్రీమారెమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఈ నెల 11వ తేదీన ప్రారంభమై ఆదివారం ముగిశాయి. చివరి రోజున భక్తులు ఆలయానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. మూడేళ్లకు ఒక్కసారి జరిగే జాతర కావటంతో ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు గ్రామానికి తరలివచ్చారు. శనివారమే మొక్కుబడులు తీర్చుకునేందుకు లాటరీ పద్ధతిలో నంబర్లు కేటాయించారు. వారుస క్రమం ప్రకారం వచ్చి అమ్మవారి ఆలయంలో నైవేద్యాలు, మొక్కలు తీర్చుకోవటం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం ఉదయం కూడా అమ్మవారు గ్రామంలో సంచారం చేశారు. వేపచెట్టు కింద ఉన్న పోతురాజు వద్ద పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కుబడులు సమర్పించుకున్నారు.

రెండో రోజు లంకమ్మవారి జాతర

అవనిగడ్డ: లంకమ్మ జాతరను పురస్కరించుకుని రెండవరోజు ఆలయానికి భక్తులు తరలివచ్చారు. కొంతమంది భక్తులు గారెలు, పొంగళ్లు తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మరికొంతమంది భక్తులు ఘటం బిందెలతో వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కుబడుతు తీర్చుకున్నారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. కొంతమంది దాతలు భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



నాగాయలంక ట్రాఫిక్ ఐలెండ్‌లో మానవహారం



మచిలీపట్నంలో మట్టల ఆదివారం విశిష్టతను ప్రదర్శిస్తున్న చిన్నారులు



ఘంటసాల గిల్గాలు చర్చి ఆధ్వర్యంలో చిన్నారులు



అవనిగడ్డలో మట్టలను పట్టుకుని ప్రదర్శన చేస్తున్న ఫాదర్ సురేష్ మెర్లో



మోపిదేవిలో ప్రభువు విశ్వాసుల ప్రదర్శన



లక్ష్మీపురం ప్రధాన రహదారిపై ఫుల్‌గాస్పెల్ చర్చి సేవకులు, చిన్నారులు



పెడనలో మాట్లాడుతున్న ఫాదర్ జోజప్ప

మచిలీపట్నంటౌన్: మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నగరంలోని క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని పలు సంఘాలకు చెందిన చర్చిలలో ప్రార్థనలకు విచ్చేసిన క్రైస్తవులు ఈత ఆకులకు పలు రకాల పువ్వులను ప్రత్యేకంగా అలంకరించి, ఆ మట్టలను చేత పట్టుకొని యేసుక్రీస్తును ప్రభుని స్తుతిస్తూ, ప్రత్యేకమైన గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన చేశారు. నగరంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో సైతం క్రైస్తవులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్‌సీఎం, సీఎస్ఐ, సీబీసీఎన్‌సీ, తదితర సంఘాలకు చెందిన చర్చిల క్రైస్తవులు ఈ మట్టల ఆదివారం కార్యక్రమం నిర్వహించారు.

నాగాయలంక: మట్టల ఆదివారం స్థానిక రక్షణ సైన్యం (సాల్వేషన్ ఆర్మీ)ఆధ్వర్యంలో నాగాయలంక ప్రధాన వీధుల్లో పామ్ సండే ర్యాలీ జరిపారు. జెరూసలేమ్‌లోకి ప్రవేశించే ఏసు ప్రభువుకు మట్టలు పర్చి స్వాగతం పలుకుతూ దావీదు కుమారునికి జయం అంటూ చేసిన ప్రార్థనలకు గురుతుగా మట్టల ఆదివారం జరగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. తొలుత స్థానిక బోస్ బొమ్మ సెంటర్‌లోని సంస్థ కార్యాలయం వద్ద ప్రధాన వీధుల్లో జరిపారు. ట్రాఫిక్ కూడలిలో మానవహారంగా ఏర్పడి ఏసు గీతాలు ఆలపించి సందేశం వినిపించారు. రాజేశ్వరికాలనీలోని సంస్థ చర్చిలో ప్రార్థనలు చేశారు. సంస్థ జిల్లా అధికారి (డి.ఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు, మహిళా విభాగం జిల్లా అధికారి మేజర్ దీనరత్నకుమారి, మేజర్ జి.రత్నం, సంపత్, పావని, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పెడన: పట్టణంలోని తోటమూల ఆర్‌సీఎం చర్చిలో విచారణ గురువు ఫాదర్ జోజప్ప ఆధ్వర్యంలో కల్వారి కొండ నుంచి మ్రానికొమ్మల ఊరేగింపుతో దేవాలయంలోకి ప్రవేశించారు. ఈ ఆదివారం దివ్య బలిపూజలో ప్రేమాంజలి కాన్వెంట్ సిస్టర్స్, ఉపదేశీకులు, దీక్షాపరులు, సంఘపెద్దలు, దళ సభ్యులు, ఉప్లా సభ్యులు, విన్సెంటిపాల్ సభ్యులు, సిలువ వెలుగు యూత్, చిన్నారి బిడ్డలు, వివిధ గ్రామల నుంచి క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

చల్లపల్లి: మండలంలో అన్ని గ్రామాల్లో ఆయా చర్చిల పరిధిలోని సేవలకులు, చిన్నారులు ఈ మట్టల ఆదివారంలో పాల్గొన్నారు. వీధుల్లో తిరుగుతూ ఏసుక్రీస్తు గీతాలను ఆలపించారు. సోమవారం నుంచి గుడ్‌ఫ్రైడే వరకూ శ్రమదినాలు, ఉపవాస దీక్షలు చేపడతామని పాస్టర్ డేవిడ్ గోల్కొండ తెలిపారు. వచ్చే ఆదివారం ఈస్టర్ పండుగతో శ్రమదినాలు, ఉపవాస దీక్షలు ముగుస్తాయని పేర్కొన్నారు.

అవనిగడ్డ: మ్రానికొమ్మల (మట్టల) ఆదివారం కార్యక్రమాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కోటరిగిలంకలోని ఆర్‌సీఎం చర్చి నుంచి ఫాదర్ జి.సురేష్ మెర్లో పూలతో అలంకరించిన మట్టలను చేతపట్టుకుని కోటగిరిలంక, సీతాయిలంక, అవనిగడ్డ ప్రాంతాల్లో పర్యటించారు. పలువురు ఉపదేశిలు, సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక సీబీసీఎన్‌సీ చర్చి పాస్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. భక్తులు పలు మట్టలను పట్టుకుని రహదారులపై ప్రదర్శన చేశారు.

ఘంటసాల: మండలంలో మట్టల ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గిల్గాలు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఘంటసాల, తాడేపల్లి చర్చిల్లో ఆరాధనలో పాస్టర్ కె.దానియేలు రాజు, నవీన్ బాబు, సతీష్ పాల్, డానీలు యేసుక్రీస్తు సిలువ వేయక ముందు యెరుషలేములో గాడిద పై ఊరేగిస్తూ హోసన్నా జయం అంటూ చేసిన నాటి ఇతి వృత్తాన్ని విశ్వాసులకు, ప్రజలకు అర్థమైయ్యే రీతిలో సందేశం అందించారు. అనంతరం సండేస్కూల్ చిన్నారులు ఈత మట్టలను పూలతో అలంకరించి గ్రామాల్లో సంచరించారు. ఘంటసాల, కొడాలి బాపిస్టు చర్చిల్లో రెవ.ఎండీవీ ప్రసాద్, మట్టా సునీత్, సునీల్, ఇతర చర్చిల్లో దైవజనులు కావూరి దేవమణి ధనరాజు, కె.దానియేలు, ఎ.యేసు, సీహెచ్.దానియేలు, కె.యేసు పాదాలు, యండకుదురు, కొడాలి, తెలుగురావుపాలెం, శ్రీకాకుళం, పాపవినాశనం, దాలిపర్రు చర్చిల్లో పాస్టర్లు శీరం సుందర్ సింగ్, గుడిసేవ ప్రదీప్, కావూరి ప్రకాష్, షాలేమ్‌రాజు, శేఖర్, యేసు ముత్యాలు, గోవాడ శ్యామ్‌బాబు, బాప్టిస్టు, ఆర్‌సీఎం, సీఎస్ఐ,అన్ని చర్చిల్లో మట్టల ఆదివారం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: నగరంలోని మల్కాపట్నంలోని ఎల్ఈఎఫ్ చర్చిలో మట్టల ఆదివారం ఇతివృత్తంతో చిన్నారులు ప్రదర్శించిన లఘు నాటిక క్రైస్తవులను ఆకట్టుకుంది. యేసుప్రభువు యెరూషలేమునకు గాడిదపై దీనుడై వెళుతుండగా అనేకమంది ప్రజలు స్వస్థతపడి, మహిమతో అయన్ను అనుసరిచారు. ఈ ఇతివృత్తాన్ని చిన్నారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి మన్ననలు పొందారు. ఎల్ఈఎఫ్ చర్చి పాస్టర్ టి. ప్రభాకరరావు పాల్గొన్నారు.

మోపిదేవి: పాపులను కాపాడేందుకే ఏసు ప్రభువు ప్రాణ త్యాగం చేశారని కల్వారి ప్రేమ మందిరం పాస్టర్ పి.రాజేష్ అన్నారు. మోపిదేవిలో తొలుత చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు ఆలపించిన అనంతరం సంఘ విశ్వాసుకుతో ఈతమట్టలు చేతబూని గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ప్రభువును ఆరాధిస్తూ, స్తుతిస్తూ పాటలు ఆలపించారు. ప్రభువు స్మరించుకుంటూ మట్టల ఆదివారం (పామ్స్ సండే) నిర్వహించినట్లు పాస్టర్ రాజేష్ వివరించారు.

బైక్‌ర్యాలీలు, డీజేలకు అనుమతి లేదు

కోనేరుసెంటర్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా బందరు సబ్‌డివిజన్‌లో సోమవారం నిర్వహించే జయంతి కార్యక్రమాలకు బైక్ ర్యాలీలు, ఫ్లెక్సీలు, డీజేల ఏర్పాటుకు పోలీసుల నుంచి అనుమతి ఇవ్వటంలేదని బందరు డీఎస్పీ సీహెచ్ రాజ తెలిపారు. అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల ప్రతి అంశాన్ని పోలీసులు డ్రోన్ కెమేరాల ద్వారా పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఫ్లెక్సీలను నిర్వాహకులు తప్పనిసరిగా ఆయా ప్రదేశాల నుంచి తొలగించాలన్నారు. లేదంటే చర్యలు తప్పవన్నారు. బైక్ ర్యాలీలు, డీజేల ద్వారా ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా పాటలు పెట్టినా, మాట్లాడినా నిర్వాహకులను బాధ్యులను చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రెండు గ్రామాలకు తాగునీరు సరఫరా

కోడూరు: వేసవి నేపథ్యంలో 'మండలి' పౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రెండు తీరప్రాంతాల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా ఉచితంగా తాగునీటిని సరఫరా చేశారు. రామకృష్ణాపురం శివారు బసవానిపాలెం, మందపాకల శివారు చింతకోళ్ల గ్రామాలకు ట్యాంకర్ నీటిని ఆదివారం అందించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చొరవ ట్యాంకర్ ద్వారా ఈ నీటిని అందిస్తున్నారు. మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు.